క్లుప్తంగా

దీపం అంటుకుని ఇల్లు దగ్ధం

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో సోమవారం ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన పసుల సారలక్ష్మి ఇంట్లో దీపం వెలిగించి సమీపంలోని చెట్టు కింద స్థానికులతో మాట్లాడుతోంది. అదే సమయంలో ఇంటి నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. ప్రభుత్వం తరఫున తక్షణ సాయంగా తహసీల్దార్ వీరభద్రం.. 25 కిలోల బియ్యం, రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

చేనేత ప్రాముఖ్యతపై వ్యాస రచన పోటీలు



చిట్యాల: మండలంలోని జడల్‌పేట ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం చేనేత ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు వాసంతి తెలిపారు. వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానంలో శ్రావణ్ కాపీని జిల్లా స్థాయికి పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లావణ్య, పావని, మధు, లక్ష్మీ, లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని ముప్పనపల్లిలోని ప్రధాన రహదారిపై ఎస్సై వెంకటేశ్ సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకోని విచారించారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుకు మరమ్మతు చేయించాలి



వెంకటాపురం(కె): మండల పరిధిలోని నూగూరు చెరువుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ సోమవారం ఆయకట్టు రైతులు తహసీల్దార్ లక్ష్మిరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నూగూరు చెరువు మధ్య తూముకు లీకేజీ అవుతుందని, మొదటి తూముకు షట్టరు లేదని దీంతో చెరువులో నీరు వృథాగా పోతుందని వాపోయారు. గత సంవత్సరం చెరువులో నీరు లేకుండా వృథాగా పోవటంతో రైతులు తమ పంటలను నష్టపోయారని అన్నారు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూగూరు చెరువుకు మరమ్మతులు చేయించేలా చర్యలు చేపట్టాని కోరారు. రైతులు చిడెం శివరవి, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



భూపాలపల్లి అర్బన్: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీలోని ప్రతీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్దు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రారంభించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పట్టణానికి పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రతలు పాటించాలని సూచించారు. అలాగే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై మున్సిపాలిటీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పట్టణ పరిధిలోని వార్డులన్నిటిలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుట, డ్రెయినేజీల్లో మట్టి ఉండకుండా నీరు సులువుగా వెళ్లుటతో పాటు పలు విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, వైస్ చైర్మన్ హరీష్, పాలకవర్గ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, కార్యాలయ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా రిసోర్స్ పర్సన్స్, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 16 వార్డు రాంనగర్‌లో కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారని కాలనీవాసులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, వార్డ్ ఆఫీసర్ నారాయణ, మెప్మా రాజేశ్వరీ, అంగన్‌వాడీ సిబ్బంది హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో అధికారులు సోమవారం స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజులో భాగంగా గ్రామ పంచాయితీల్లో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, విద్యార్థులతో కలిసి ర్యాలీలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పరిసరాల పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించారు. కాటారం, ధన్వాడ, రేగులగూడెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కాటారం ప్రధాన కూడలిలో అధికారులు మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, పంచాయితీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, ఉమాదేవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొగుళ్లపల్లి: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



రేగొండలో..

మల్హర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ అన్నారు. సచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో సోమవారం అవగాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ విక్రమ్, పంచాయతీ కార్యదర్శి, వైద్యశాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం–పచ్చదనంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి అవినాష్, ప్రిన్స్‌పాల్ విజయదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రవీందర్, అధ్యాపకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్, స్వరూపరాణి, రమేశ్, భరత్‌రెడ్డి, రవి, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, శ్రమదానం నిర్వహించారు. మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి చౌరస్తా మీదుగా గ్రామ పంచాయతీ వరకు ప్రధానోపాధ్యాయులు పి.విజయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి సునీత, పంచాయతీ కార్యదర్శి నరేష్ ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం–పచ్చదనంపై అవగాహన

రేగొండ: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు పారిశుద్ధ్యం, వైద్య సేవలు, మొక్కలు నాటడం, ర్యాలీలు, శ్రమదానం, వనమహోత్సవం పనులు చేపట్టి విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు 18 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని డీఎల్‌పీఓ వీరభద్రయ్య ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. గ్రామంలో ర్యాలీ తీసి అవగాహన కల్పించారు. ఎంపీఓ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.



కాటారం: అధికారులు, విద్యార్థుల మానవహారం



తాడిచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



భూపాలపల్లి రూరల్: ర్యాలీలో కాలనీవాసులు



మహదేవపూర్‌లో..

‘ప్రభుత్వ ఆస్పత్రులపై నిర్లక్ష్యం’

కాటారం: ప్రభుత్వ ఆస్పత్రులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ.. నిత్యం రోగులతో రద్దీగా ఉండే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నెల రోజులుగా మందులు స్టాక్ లేకపోవడం శోచనీయం అన్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని ఈ ప్రాంతంలోని పేద ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటారని తెలిపారు. ఆస్పత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్‌గా మందులు కొనుక్కునే ఆర్థిక పరిస్థితులు లేక పేద ప్రజలు రోగాలతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ప్రజలకు ప్రభుత్వ వైద్యం కరువవుతుందని విమర్శించారు. వెంటనే కాటారం ఆస్పత్రికి మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎస్సై ప్రసాద్

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన విద్యార్థిని చుక్క అన్వితకు ఇంజనీరింగ్ ఈసీ స్టేట్‌లో 20వ ర్యాంకు సాధించి సీబీఐటీలో సీటు సాధించినందుకు గాను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై ప్రసాద్, ఎంపీడీఓ అనిత హాజరై మాట్లాడుతూ.. పేదరికం చదువుకు అడ్డుకాదని, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చాని అన్నారు. ఉన్నతంగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర నాయకుడు దూడపాక శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మధుర మహేందర్‌రెడ్డి, గ్రామస్తులు ప్రభాకర్, వెంకన్న, పవన్, రాములు, సందీప్, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి

కాటారం: విద్యార్థులు విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏవీఎస్ ఫంక్షన్ హాల్‌లో స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా సోమవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, ఇంపాక్ట్ ఫౌండేషన్ వక్తలు డాక్టర్ శ్రీకాంత్, రామ్‌కమల్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు అంటే కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి లక్ష్యంను ఎంచుకొని ఆ గమ్యాన్ని చేరే వరకు నిరంతర కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలు, అసాంఘిక కార్యక్రమాల వైపు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. అలాగే డీఎస్పీ రామోహ్మన్ రెడ్డి, మండల వైద్యాధికారిణి మౌనిక, మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ వారి విద్యాభ్యాసం, ఉద్యోగ సాధన కోసం శ్రమించిన తీరును విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ కొట్టె సతీశ్, వక్తలు శ్రీనివాస్‌బాపూజీ, జాడి శ్రీశైలం, సదానంద్‌మురారి, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అజారుద్దీన్

కాటారం: కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజారుద్దీన్ తెలిపారు. కాటారం సబ్ పోస్టాఫీస్ పరిధిలోని దామెరకుంటలో సోమవారం తపాలాశాఖ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(డీసీడీపీ) నిర్వహించారు. సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, యాక్సిడెంటల్ పాలసీలు, ఇతర పథకాలను గూర్చి గ్రామస్తులకు తపాలాశాఖ అధికారలు వివరించారు. ఈ సందర్భంగా అజారుద్దిన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోస్టాఫీస్‌లో సేవింగ్ ఖాతాను తీసుకొని అనేక ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. తపాలాశాఖ ప్రతి పథకం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దామెరకుంట బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ భార్గవి, మెయిల్ ఓవర్సీస్ రాజు, సత్యం, ఖాతాదారులు, ప్రజలు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



రేగొండ: అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

రేగొండ: పిల్లలకు తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని జగ్గయ్యపేట క్లస్టర్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. సోమవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు, మహిళా సాధికారిత కేంద్రం అవగాహన సదస్సుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి తల్లిపాల ప్రాముఖ్యతను, పోషకాహారం గురించి తెలిపారు. అదే విధంగా మహిళా సాధికారత ఇన్‌చార్జ్ డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ అనూష మాట్లాడుతూ.. ఆడపిల్లలపై లైంగిక వేధింపులు రోజురోజుకు పెరుగుతున్నయన్నారు. సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉండాలని, వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌లలో ఫొటోలు షేర్ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది మమత, డీసీపీయూ సిబ్బంది కుమార్, వీఓ సంఘం లీడర్స్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల: పిల్లలకు తల్లిపాలు తగించడంతో ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్ (వీ)లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజన ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలనే పట్టించాలని సూచించారు. పుట్టిన బిడ్డకు ముర్రు పాలు పట్టించడం వల్ల రోగ నిరోధకశక్తి వృద్ధి చెందుతుదని తెలిపారు. భవిష్యత్‌లో బిడ్డ ఆరోగ్యానికి భరోసా తల్లి పాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఈర్ల పూర్ణిమ, హేమలత, రజిత, ఏఎన్‌ఎం సంగీత, పంచాయితీ కార్యదర్శి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్లలో..



కాళేశ్వరం: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం, మెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అన్నారంలో తల్లులు, గర్భిణులకు అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి మంజూర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి గ్రామానికి చెందిన వతందుపుల సుమలత తల్లి రాధ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. దీంతో సుమలతో కలిసి వేములపల్లి గ్రామంలో చదువుకున్న 2003–04 పదో తరగతి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, సుప్రియ, మౌనిక, రమణ, రజిత, పూర్ణచంద్ర రాజుకుమార్, మహేష్, రాజు, బాలకృష్ణ, శ్రావణ్ కుమార్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



సన్మానం పొందిన కార్యదర్శులతో అధికారులు

రేగొండ: మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, నరేష్, కోటి, కుమారస్వామి, శ్వేత, రమాదేవి, స్వప్న బదిలీ కావడంతో సోమవారం మండల కేంద్రంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు తెలిపారు. అలాగే చిన్నకోడేపాక గ్రామపంచాయతీ కార్యదర్శిగా పని చేసి కొనరావుపేటకు బదిలీపై వెళ్తున్న రాంబాబును గ్రామస్తులు సన్మానించి, మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ రాంప్రసాద రావు, పంచాయతీ కార్యదర్శులు గోపాలకృష్ణ, సురేందర్, శ్రీకాంత్, కుమార్, మౌనిక, మమత, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు సీఐ బండారి కుమార్ సోమవారం బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వీరభద్రవరం, రెండవ స్థానంలో చిరుతపల్లి, మూడవ స్థానంలో మొర్రవానిగూడెం జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి రావు తదితరులు ఉన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్లు

వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మాజీ అధ్యక్షుడు తిరుపతి వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పండ్లు పంపిణీ చేశారు. అనంతరం తిరుపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగం సాంబశివరావు, వేల్పూల కిషోర్, వెంకటేష్, బన్నీ, వంకాయల రాము, సాయి, చంద్రకళ తదితరులు ఉన్నారు.

వన సంరక్షణతోనే మన సంరక్షణ

మంత్రి సీతక్క



పస్రా అటవీ కార్యాలయంలో తునికాకు సేకరణ లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని, వన సంరక్షణ అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని పస్రాలోని అటవీ డివిజన్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర, టీఎస్.డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌లతో కలిసి స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మొక్కలను నాటి పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పలు మండలాల్లోని 141 గ్రామాలకు చెందిన బ్లాక్ ఫారెస్ట్‌లో తునిక ఆకు సేకరణ లబ్ధిదారులకు బోనస్ రూ.కోటి 55 లక్షల 74 వేల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూర్ సిగ్నెట్లో(మిషన్ భగీరథ ప్లాంట్) పరిధిలో పనిచేస్తున్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మికులు సోమవారం మండల కేంద్రంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ మిషన్ భగీరథలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి 60జీఓను వెంటనే అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి పీఆర్సీ అమలు చేయాలన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని, ప్రభుత్వమే వారికి జీతాలు ఇవ్వాలని కోరారు. మిషన్ భగీరథ కార్మికులు కొండగొల్ల రాజేష్, గజ్జెల్లి ప్రశాంత్, సిసింద్రీ, పాషా, దాబీర్, లొంక రాజు, సాంబయ్య, రాజ సదానందం, శేఖర్, మహేందర్, సంకృత్, సాయి తేజ, శ్రీనివాస్, పాషా, అఖిల్, సునీల్, పవన్, శ్రావణ్, నాగేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హక్కు పత్రాలు కల్పించాలని వినతి

చిన్నబోయినపల్లి పరిధిలోని రైతులకు హక్కు పత్రాలు కల్పించాలని, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను చిన్నబోయినపల్లిలోనే నిర్మించాలని చిన్నబోయినపల్లి రైతులు వడ్కాపురం సారయ్య, లక్ష్మారెడ్డి తదితరులు మంత్రి సీతక్కకు వితని పత్రాన్ని అందజేశారు. సోమవారం మండల కేంద్రంలో మంత్రికి కలిసి సమస్యలను విన్నవించారు.



ఏటూరునాగారం: మంత్రి సీతక్కకు సమస్యలను వివరిస్తున్న రైతులు